జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం... ప్రజల కోసం
## సిద్దిపేట
సోమవారం | 27 | జూలై | 2026 | పేజీలు : 7

## పోచమ్మ ఆలయంలో యంత్ర ప్రతిష్ఠాపన నిర్వహణ



6 లో



# తెలంగాణ అభివృద్ధే లక్ష్యం



కొమురవెళ్ళి , జులై 26 , (ప్రజాజ్యోతి): : తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో రైల్వే రంగం ఎన్నడూ లేనంత వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. మనోహరాబాద్-సిద్దిపేట రైల్వే మార్గంలో నూతనంగా నిర్మించిన కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ని

మిగతా 2లో..

### రైల్వే అభివృద్ధిలో కొత్త ఒరవడి

### కొమురవెల్లి భక్తుల కల సాకారం

### రైల్వే హాల్ట్ ను ప్రారంభించిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్



---

### వెనుక గొయ్యి,ముందర నుయ్యి చందంగా

## కొక్కొండ క్రీడా ప్రాంగణం

ఈ క్రీడా ప్రాంగణంలో ఏ రోజు క్రీడలు జరగలేదు

ప్రజాధనం వృధా తప్ప పనికొచ్చింది ఏమీ లేదు




3 లో



## తెలంగాణ ఉద్యమకారులు ఎవరు?

గుర్తింపు ప్రమాణాలపై మళ్లీ చర్చ... ఉద్యమం ఒక్క వర్గానిదే కాదు

సమాజమంతా చేసిన పోరాటం

జర్నలిస్టుల నుంచి విద్యార్థుల వరకు అందరి పాత్ర కీలకం

లాఠీ దెబ్బలు తిన్న సామాన్యులకు గుర్తింపు ఎక్కడ?

ఉద్యమకారుల ఎంపికలో పారదర్శకత అవసరమె

2 లో

## మహిళల ఆరోగ్యమే లక్ష్యం

ఈ నెల 29న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



# తెలంగాణ అభివృద్దే లక్ష్యం



మొదటి పేజీ తరువాయి..

ఆదివారం ఘనంగా ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఈ రైల్వే స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని, ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపు తీసుకురావడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని ఆయన అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరిస్తున్నామని, హైదరాబాద్, కాచిగూడ, కాజీపేట, వరంగల్ తదితర ప్రధాన రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కొత్త రైల్వే మార్గాలు, డబ్లింగ్, మూడో లైన్ ప్రాజెక్టులు, ఐదు వందే భారత్, ఆరు అమృత్ భారత్ రైళ్ల ప్రారంభం, రాష్ట్రానికి మంజూరైన త్రి హైస్పీడ్ రైలు ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధిలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతాయన్నారు.కొమురవెల్లి రైల్వే స్టేషన్ నుంచి శ్రీ మల్లన్న ఆలయానికి ప్రత్యేక షటిల్ బస్సు సేవలను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించిన కేంద్ర మంత్రి, ఈ విషయమై సంబంధిత అధికారులకు లేఖ రాయాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణకు 5,454 కోట్ల రూపాయల రైల్వే బడ్జెట్ కేటాయించామని తెలిపారు. ఇది గతంతో పోలిస్తే ఇరవై రెట్లు అధికమని పేర్కొంటూ, రీజినల్ రింగ్ రైల్, హైస్పీడ్ రైల్ కారిడార్లు, కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్, మూడో లైన్ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో రైల్వే అనుసంధానం మరింత బలోపేతం కానుందని తెలిపారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభంతో భక్తులకు మాత్రమే కాకుండా రైతులు, చిన్న వ్యాపారులు, విద్యార్థులు, యువతకు కూడా ప్రయాణ, ఉపాధి అవకాశాలు





విస్తరించనున్నాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు .ప్రారంభోత్సవానికి ముందు కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు రెండు నిమిషాల మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు మల్లన్న ఆలయంలో ప్రత్యక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, సి. అంజి రెడ్డి, జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, కొమురవెల్లి గ్రామ సర్పంచ్ జి. పద్మ, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.









## మహిళల ఆరోగ్యమే లక్ష్యం

### ఈ నెల 29న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

సిద్దిపేట, జులై 26 ,(ప్రజాజ్యోతి): క్యాన్సర్ అంటే భయపడాల్సిన అవసరం లేదని, కానీ ఆలస్యం చేయడమే ప్రమాదమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీష్ రావు అన్నారు. హైదరాబాద్కు చెందిన సింధూ క్యాన్సర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఈ నెల 29వ తేదీ సిద్దిపేట బైపాస్ రోడ్డులోని విపంచి కళానిలయంలో నిర్వహించనున్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం వివరాలను ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, 'ముందస్తు వైద్య పరీక్ష.. మీ ప్రాణానికి రక్ష' అన్నారు. జీవితంలో ఒక్కరోజు సమయం కేటాయించి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే జీవితాంతం ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. క్యాన్సర్ ప్రారంభ దశలో చాలాసార్లు ఎలాంటి లక్షణాలు కనిపించవని, అయితే స్క్రీనింగ్ పరీక్షల ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు.40 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ కారణంగా అనేక మంది మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, ఆలస్యంగా గుర్తించడం వల్ల కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు కూడా మహిళలను పరీక్షలకు పంపించేలా ప్రోత్సహించాలని సూచించారు.గతంలో కూడా కార్పొరేట్ ఆసుపత్రుల సహకారంతో నిర్వహించిన స్క్రీనింగ్ శిబిరాల్లో పలువురిలో ప్రారంభ దశలోనే క్యాన్సర్ లక్షణాలు గుర్తించడంతో వెంటనే చికిత్స ప్రారంభించి వారి ప్రాణాలను కాపాడగలిగామని గుర్తు చేశారు. అదే ఉద్దేశంతో మరోసారి ఈ ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ నెల 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విపంచి కళానిలయంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.శిబిరంలో అవసరాన్ని బట్టి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ, మామోగ్రామ్ , రక్త పరీక్షలు, ఎక్స్రే తదితర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 40 ఏళ్లు పైబడిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ ఉద్యమకారులు ఎవరు?

కొండపాక జూలై 26 (ప్రజా జ్యోతి ):-తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం ఒక్క పార్టీ, ఒక్క నాయకుడు లేదా ఒక్క వర్గం చేసిన పోరాటం కాదు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు, మహిళలు, కార్మికులు, న్యాయవాదులు, రచయితలు, కళాకా రులు, ప్రజా సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు సహా సమాజంలోని దాదాపు అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో తమవంతు పాత్ర పోషించారు.ఉద్యమ సమయంలో అనేక మంది సామాన్య ప్రజలు పోలీసుల లాఠీచార్జీలను ఎదుర్కొన్నారు. కేసులు ఎదుర్కొన్నారు. అరెస్టులు భరించారు. కొందరు గాయపడ్డారు. మరికొందరు ప్రాణత్యాగాలు కూడా చేశారు. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిజమైన ఉద్యమకారుల గుర్తింపు విషయంలో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.జర్నలిస్టులు ఉద్యమానికి సంబంధిం చిన వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా తెలియజేయడంలో మీడియా పాత్రను విస్మరించలేమని పలువురు గుర్తుచేస్తున్నారు. అలాంటి పరిస్థితిలో ఉద్యమకారుల గుర్తింపులో జర్నలిస్టులు సహా వివిధ వర్గాల సేవలను ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటున్నారనే అంశంపై చర్చ కొనసాగుతోంది.మరోవైపు, ఉద్యమ సమయంలో







ప్రత్యక్షంగా పాల్గొనని కొందరు వ్యక్తులు తర్వాత తమను ఉద్యమకారులుగా ప్రచారం చేసుకుంటూ ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం ముందుకు వస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో నిజంగా లాఠీ దెబ్బలు తిన్న సామాన్యులు, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యమంలో పాల్గొన్న కార్యకర్తలు గుర్తింపు కోసం ఎదురుచూడాల్సి వస్తోందనే ఆవేదన వ్యక్తమవుతోంది.ఉద్యమకారుల ఎంపికకు స్పష్టమైన ప్రమాణాలు ఏమిటి? ఎలాంటి ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటారు? పోలీసు కేసులు, అరెస్టులు, గాయా లు, ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్న రికార్డులు, ప్రజా సంఘాల ధృవీకరణ వంటి అంశాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తారు? అనే ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. తెలంగాణ ఉద్యమం చరిత్రలో ప్రతి వర్గం చేసిన త్యాగం, సేవకు సముచిత గౌరవం లభించాలంటే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నిజమైన ఉద్యమ స్ఫూర్తిని కాపాడాలంటే రాజకీయాలకు అతీతంగా వాస్తవంగా ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# కిరాణం షాపుల్లోనే మద్యం దందా

## బెల్టు షాపులపై ఎక్సైజ్ నిఘా

## ఇద్దరిపై కేసు నమోదు



అక్కన్నపేట,జూలై26(ప్రజాజ్యోతి): అక్కన్నపేట మండలంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్టు షాపులపై హుస్నాబాద్ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం విరుచుకుపడ్డారు. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న మద్యం దందాను రట్టు చేసి ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న శ్రీనివాస కిరాణా షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆదివారం ఉదయం షాపుపై దాడి చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బానోత్ ఉమ అనే మహిళ వద్ద నుంచి 6 లీటర్ల బీరు, 3.7 లీటర్ల ఐఎంఎఫ్ఎల్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా చాపతండాకు వెళ్లిన ఎక్సైజ్ బృందం అక్కడ కూడా తనిఖీలు చేపట్టింది. గుగులోతు కొమురయ్య అనే వ్యక్తి వద్ద నుంచి 5 లీటర్ల బీరు, 3.6 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. రెండు చోట్ల కలిపి మొత్తంగా 11 లీటర్ల బీరు, 7.3 లీటర్ల మద్యం సీజ్ చేసి, నిందితులిద్దరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ రైడ్స్లో హుస్నాబాద్ ఎక్సైజ్ ఎస్సై దామోదర్, హెడ్ కానిస్టేబుల్ కొండల్ రావు, కానిస్టేబుళ్లు సంపత్, శైలజ పాల్గొన్నారు.

## వెనుక గొయ్యి,ముందర నుయ్యి చందంగా

# కొక్కొండ క్రీడా ప్రాంగణం

## ఈ క్రీడా ప్రాంగణంలో ఏ రోజు క్రీడలు జరగలేదు

## ప్రజాధనం వృధా తప్ప పనికొచ్చింది ఏమీ లేదు



ములుగు,జూలై26(ప్రజా జ్యోతి)బిఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామ గ్రామాన యువకుల క్రీడా సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు.అయితే ఈ క్రీడా ప్రాంగణాలు ఏ ఉద్దేశంతో అయితే ఏర్పాటు చేశారో యువకులకు ఆటలు ఆడుకోవడానికి కావలసిన స్థలాన్ని గ్రామ సమీపంలోని ప్రభుత్వ స్థలాల్లో ఎంపిక చేసి ఏర్పాటు చేయాల్సి ఉంది కానీ కొక్కొండ గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం మాత్రం వెనక పెద్ద గుంత,చెట్లు,పక్కన శవాలు పూడ్చిన గోరీలు,మరోపక్క మట్టి కుప్పలు ఇవి తప్పితే అందులో ఏనాడు యువకులు ఆటోలో ఆడినట్లు కనిపించట్లేదు.ప్రజాధనం వృధా తప్ప యువకులకు పనికొచ్చిన సందర్భం లేదని,ఇకనైనా అధికారులు క్రీడలకు అనువైన స్థలాన్ని కేటాయించి యువకులకు క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



# టిజి ట్వంటీ పట్ల బిసిసిఐ నోటీసు

## హెచ్ సి ఏ అహంకారపూరిత మౌనం'పై

## టీసీఏ ఆగ్రహం

సిద్దిపేట, జూలై 26(ప్రజాజ్యోతి): టిజి ట్వంటీ లీగ్లో అక్రమాలు, ఆర్థిక వ్యత్యా సాలపై బిసిసిఐ కోరిన వివరణకు నిర్దేశిత నాలుగు వారాల గడువు ముగిసినా స్పందించకపోవడంపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్.సి.ఏ)) ప్రదర్శిస్తున్న వైఖరిని 'అత్యంత అహంకారపూరితం'గా అభివర్ణించింది.హెచ్.సీఏతీరును ప్రశ్నిస్తూ టీసీఏ ప్రధాన కార్యదర్శి ధర్మ గురువా రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. టిజి20 టోర్నమెంట్ వాణిజ్యపరంగా విజయం సాధించినంత మాత్రాన, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అడిగిన తీవ్రమైన ప్రశ్నలకు సమాధానం చెప్పే బాధ్యత నుంచి హెచ్.సీఏ తప్పుకోగలదా అని ఆయన నిలదీశారు. టిజి20 విజయోత్సవాలు చేసుకుంటే సరిపోతుందా? బిసిసిఐ నిబంధనలను లేదా తమ స్వంత బై-లాస్ను ఉల్లంఘించారా లేదా అనే విషయాన్ని బిసిసిఐకి, తెలంగాణ క్రికెట్ అభిమానులకు తెలియజేసే బాధ్యత హెచ్.సి.ఏ కి లేదా? ఇది అహంకారం కాకపోతే ఇంకేమిటి?' అని గురువా రెడ్డి ప్రశ్నించారు.చట్టాన్ని తమకు నచ్చినట్లు వాడుకోవడం, పరిపాలనాపరంగా మౌనంగా ఉండటమే కవచంగా మార్చుకోవడం చూస్తుంటే.. పాలనలో 'చట్టబద్ధత' కనుమరుగై, 'ఎవరి రాజ్యం?' అనే పరిస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు.

### 'నోటీసులను తేలికగా తీసుకుంటున్నారు'

'వ్య వ్యవస్థాగత ఉల్లంఘనలు, పారదర్శకత లేకపోవడంపై వివరణ కోరుతూ బిసిసిఐ అంబుడ్స్మన్ మరియు ఎథిక్స్ ఆఫీసర్ జస్టిస్ అరుణ్ మిశ్రా కఠినమైన నోటీసు ఇచ్చి నాలుగు సుదీర్ఘ వారాలు గడిచిపోయాయి. అయినప్పటికీ, హెచ్.సి.ఏ అహంకారపూరిత మౌనాన్ని ఆశ్రయించింది. అధికారిక నియంత్రణ ఆదేశాలను ఏదో ప్రకటనల పాంప్లెక్స్ లాగా చాలా తేలికగా తీసుకుంటోంది' అని గురువా రెడ్డి ఆరోపించారు.'సుప్రీంకోర్టు ఆదేశించిన లోధా కమిటీ సంస్కరణలను విస్మరించడం నుండి సంప్రదింపుల వ్యవస్థను పక్కన పెట్టడం వరకు.. ఇది కేవలం పాలనాపరమైన ఆలస్యం కాదు, కావాలని చేస్తున్న ఉల్లంఘన. సంస్థలు రాత్రికి రాత్రే నాశనం కావని, జవాబుదారీతనం ఐచ్ఛికంగా, పారదర్శకత భారంలా మారినప్పుడు లోపల నుంచి గుల్లయిపోతాయి' అని ఆయన పేర్కొన్నారు.

### మహాభారతం, రామాయణాల ప్రస్తావన

మహాభారతంతో పోలుస్తూ.. కురుసభలో పెద్దలు మౌనంగా ఉండి ధర్మం నాశనమవుతుంటే ప్రేక్షకులుగా చూశారని, ఈ రోజు పాలన బాధ్యతలు ఉన్నవారు జవాబుదారీతనాన్ని విడిచిపెట్టి మౌనాన్ని ఎంచుకుంటే తెలంగాణ క్రికెట్కు కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు.ఈ వ్యవస్థ ఏమి సృష్టించిందో దగ్గరగా చూడాలనివరంగల్, కరీంనగర్, మెదక్ వంటి చారిత్రాత్మక జిల్లాల పేర్లను వ్యాపార ప్రచారాలుగా వాడుకుంటున్నారని,కానీ



గ్రామీణ ప్రాంతాల్లోని నిజమైన క్రికెట్ ప్రతిభకు మాత్రం తలుపులు మూసేస్తున్నారు. క్రికెట్ అనేది కొద్దిమంది ప్రముఖుల సొత్తు కాదు' అని వ్యాఖ్యానించారు.చాణక్యుడి బోధనలను, రామాయణంలోని రాజధర్మాన్ని గుర్తుచేస్తూ.. పాలకులు, అధికారులు వ్యక్తిగత లేదా సంస్థాగత ప్రయోజనాల కంటే ప్రజల ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని ఆయన హితవు పలికారు. 'జిల్లా క్రికెటర్ల కలలను వేలం వేసినప్పుడు ఈ రాజధర్మం ఏమైంది?' అని ఆయన ప్రశ్నించారు.హెచ్.సి.ఏలో సమూల మార్పులకు డిమాండ్హెచ్.సి.ఏలో శస్త్రచికిత్స లాంటి మార్పులు జరగాలని, తెలంగాణ క్రికెట్లో ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించాలని టీసీఏ డిమాండ్ చేసింది. 'కాలయాపన చేసే రోజులు ముగిశాయి. మేము స్వతంత్ర ఆర్థిక ఆడిట్, బ్యాంక్ ఖాతాల పూర్తి బహిర్గతం, టిజి20 ఒప్పందాల సమగ్ర పరిశీలన మరియు పరస్పర ప్రయోజనాల ఘర్షణ ఉన్న నిర్ణయాధికారులను పదవుల నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణ క్రికెట్కు పారదర్శకత, వ్యవస్థాగత జవాబుదారీతనం ఎంతైనా అవసరం' అని గురువా రెడ్డి స్పష్టం చేశారు.శ్రీరాముడు అధర్మంతో రాజీపడలేదని, శ్రీకృష్ణుడు ధర్మాన్ని కాపాడేందుకు అవినీతి వ్యవస్థలను కూల్చివేశాడని.. అదే రీతిలో న్యాయపరమైన, నియంత్రణ పరిధిలోని ఆదేశాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా టీసీఏ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని చెప్పారు.టీసీఏ క్రికెట్ దేవాలయాన్ని కూల్చాలని అనుకోవడం లేదని, అక్కడ పేరుకుపోయిన మురికిని శుభ్రం చేసి, ప్రైవేట్ వ్యక్తుల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టి, ఆటను దాని నిజమైన యజమానులకు అప్పగించాలనుకుంటోంది. ప్రజాస్వామ్య ఒత్తిడి ద్వారా ఆ తలుపులు తెరుచుకునేలా చేస్తామని, రికార్డులను ప్రజల ముందుకు తెస్తామని, ఎందుకంటే తెలంగాణ క్రికెట్ ఇక్కడి ప్రజలది... తాళాలు వేసుకుని కూర్చున్న స్వయంప్రకటిత నియంతలది కాదు' అనిహెచ్చరించారు.

# ఇటుక బట్టీ కార్మికుడికి బాసట

## నిత్యావసర సరుకులు, వైద్య సహాయం

## అండగా నిలుస్తున్న విజయభాస్కర్

హుస్నాబాద్, జూలై 26(ప్రజాజ్యోతి): ద్వి చక్ర వాహన యాక్సిడెంట్లో గాయపడి మంచాన పడ్డ ఇటుక బట్టీ కార్మికుడి కుటుంబానికి బీఆర్ఎస్ మాజీ ఏఎంసీ డైరెక్టర్ కూతాటి విజయభాస్కర్ పెద్దన్నలా అండగా నిలిచారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 1వ వార్డు కస్తూర్బా కాలనీకి చెందిన ఇటుక బట్టీ కార్మికుడు మంద సదానందం మూడు నెలల క్రితం ఘోర బైక్ ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో పనికి వెళ్లలేక, ఆర్థిక ఇబ్బందులతో సదానందం కుటుంబం నరకం





చూసింది. ఈ విషయం తెలుసుకున్న కూతాటి విజయభాస్కర్ గత మూడు నెలలుగా ఆ కుటుంబానికి అవసరమైన వైద్య ఖర్చులు భరిస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. తాజాగా సదానందం ఇంటికి వెళ్లిన విజయభాస్కర్.. ఆ కుటుంబానికి మూడు నెలలకు సరిపడా సుమారు రూ.20 వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. కష్టకాలంలో ఆపద్బాంధవుడిలా నిలిచిన ఆయన సేవా గుణాన్ని స్థానికులు, కాలనీవాసులు మనస్ఫూర్తిగా అభినందించారు. అనంతరం కేబీ కాలనీలోని పలు పేద కుటుంబాలను విజయభాస్కర్ పరామర్శించి, ప్రతీ ఒక్కరికీ 25 కిలోల బియ్యాన్ని పంపిణీ చేశారు.

## నిమ్స్ ఆసుపత్రి లో చికిత్సకు రూ.1 లక్ష ఎల్ఓసీ చెక్కు అందజేత



మిరుదొడ్డి, జూలై 26, (ప్రజాజ్యోతి): హైదరాబాద్లోని నిమ్స్ ఆస్పత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మిరుదొడ్డి మండల పరిధిలోని పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన అరకంటి నరసయ్యకు రూ.1 లక్ష విలువైన ఎల్ఓసీ చెక్కును ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ మిరుదొడ్డి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద ప్రజలకు అండగా నిలుస్తూ, అవసరమైన సమయంలో వైద్య సహాయం అందించడంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన ఎల్ఓసీ చెక్కును పెద్ద చెప్యాల గ్రామ సర్పంచ్ కమటం అంకిత నరేష్, గ్రామ అధ్యక్షుడు యాహో శివ, బీఆర్ఎస్ పార్టీ మిరుదొడ్డి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజేందర్ కలిసి లబ్ధిదారుడు అరకంటి నరసయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వైద్య రత్న పురస్కార గ్రహీత డా. హేమరాజ్ సింగ్‌కు బక్కి వెంకటయ్య ఘన సన్మానం



మిరుదొడ్డి,జూలై 26, (ప్రజాజ్యోతి): వైద్య సేవా రంగంలో విశిష్ట సేవలు అందించి 'వైద్య రత్న' పురస్కారాన్ని అందుకున్న దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. హేమరాజ్ సింగ్ను హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ వైద్య వృత్తికి గౌరవాన్ని తీసుకొస్తున్న డా. హేమరాజ్ సింగ్ సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. వైద్య రంగంలో ఆయన చూపుతున్న అంకితభావం, సేవా తపనకు గుర్తింపుగా 'వైద్య రత్న' పురస్కారం లభించడం రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం డా. హేమరాజ్ సింగ్కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు పాల్గొన్నారు.



## తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా

# గోరింటాకు పండుగ

### ఆషాఢ మాస ఆచారాలకు నంగునూరులో మహిళల ప్రాధాన్యం

నంగునూరు, జూలై 26(ప్రజా జ్యోతి):తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గోరింటాకు పండుగను నంగునూరు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాస ఉత్సవాల సందర్భంగా ఘనంగా నిర్వహించారు. గ్రామీణ సంస్కృతిని తదుపరి తరాలకు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విశేష ఆదరణ పొందింది.గోరింటాకు అనేది కేవలం అందాన్ని పెంచే అలంకరణ మాత్రమే కాదు. అది శుభానికి, సౌభాగ్యానికి, కుటుంబ సౌఖ్యానికి ప్రతీకగా తెలుగు సమాజంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ముఖ్యంగా ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం అనేది తరతరాలుగా వస్తున్న ఆచారం. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మహిళలు ఉత్సాహంగా పాల్గొ





న్నారు. వల్లపురెడ్డి స్వప్న, చౌడుచర్ల మమత, మెతుకు మాధవి, వల్లపురెడ్డి రమ, పప్పు నవనిత, వల్లపురెడ్డి శశికళ, ముత్తయ్యగారి కవిత, తుమ్మకోలు మాధవి తదితరులు కార్యక్రమంలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకువచ్చారు.ప్రపంచీకరణ ప్రభావంతో గ్రామీణ సంస్కృతులు కనుమరుగయ్యే ప్రమాదం ఉన్న సమయంలో ఇలాంటి కార్యక్రమాలు యువతలో సంప్రదాయాలపై అవగాహన పెంచడమే కాకుండా, సామాజిక బంధాలను బలోపేతం చేస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఆషాఢ మాస ఆధ్యాత్మికత, మహిళల సాంస్కృతిక చైతన్యం, తెలుగు సంప్రదాయాల గొప్పతనాన్ని ఒకే వేదికపై ఆవిష్కరించిన ఈ గోరింటాకు పండుగ గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంది.

## లయన్స్ క్లబ్ సేవలు అభిందనీయం: ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్ జూలై 26(ప్రజా జ్యోతి):లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం అని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు.ఆదివారం గజ్వేల్ అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద లయన్ తాటి రాములు కుమారుడు డాక్టర్ తాటి అఖిల్ జన్మదినం సందర్భంగా ఉచిత డయాబెటిక్ శిబిరం ఏర్పాటు చేసి,భక్తులకు పులిహోర పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పాల్గొని వారు మాట్లాడుతూ సామాజిక సేవలు చేస్తున్న లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం అని డాక్టర్ అఖిల్ జన్మదినం సందర్భంగా ఉచిత డయాబెటిక్ శిబిరం ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమం ప్రతి ఒక్కరు సేవా గుణం కలిగి ఉండాలని కోరారు.కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నాయిని సత్యలక్ష్మి యాదగిరి,లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు డాక్టర్ కుమార స్వామి,గోలి సంతోష్, సుభాష్ చంద్ర బోస్,సంజయ్ గుప్త,గుడాల రాధ కృష్ణ, నంగునూరి సత్యనారాయణ,నేతి శ్రీనివాస్, పార్థసారథి రాజు,రాజారాం, అయిత సత్యనారాయణ, దొంతుల సత్యనారాయణ, రావికంటి చంద్ర శేఖర్, అయిత సత్యనారాయణ,అడిములం నారాయణ, రమేష్, మల్లేశం గౌడ్, టీచర్ సంతోష్,తాటి రాములు, డాక్టర్ అఖిల్ డాక్టర్ సౌమ్య,లయన్స్ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు



## యంగ్ ఇండియా స్కూల్ కొండపాక లోనే చేయాలి

కొండపాక జిల్లా 26( ప్రజా జ్యోతి)'- కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం వెలికట్ట ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు మంచాల కనకరాములు మాట్లాడుతూ, యంగ్ ఇండియా స్కూల్ను కొండపాక మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని గత పది రోజులుగా అన్ని వర్గాల ప్రజలతో కలిసి ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు.స్థానికంగా స్కూల్ తరలింపుపై ఎలాంటి అధికారిక ఉత్తర్వులు, నోటిఫికేషన్లు లేకపోయినా బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం ధర్నాలు నిర్వహిస్తూ కాంగ్రెస్ నాయకత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. భావితరాల విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, స్కిల్ డెవలప్మెంట్ అవకాశాలు కల్పించే యంగ్ ఇండియా స్కూల్ను కొండపాకలోనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ప్రణీత్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు వాసరి లింగారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గజవెల్లి



సుదర్శన్, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిబాబా, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రిప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి సహాయం అందేలా ప్రణాళికతో ముందుకు సాగుతాం

### వంటిమామిడిలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

### రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు సాయి రెడ్డి

ములుగు,జూలై26(ప్ జాజ్యోతి)ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే ప్రతి విద్యార్థికి ఏదోరకంగా సహాయం చేసేలా ప్రణాళికలతో ముందుకు వెళుతున్నట్లు రోటరీ క్లబ్ గజ్వేల్ అధ్యక్షుడు కొక్కొండ సాయి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ములుగు మండల పరిధిలోని వంటిమామిడి పాఠశాలకు చెందిన15 మంది విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేశామని,ఇకనుండి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సమయానికి పాఠశాల చేరుకునేలా సైకిల్ అందచేస్తున్నామని,గత 17 సంవత్సరాలుగా నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నట్లు ఆయన వివరించారు .ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు బెంచీలు,స్పోర్ట్స్ సామాగ్రి,ఏకరూప దుస్తులు,బూట్లు పంపిణీ చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ చైర్మన్లు కొడాలి చంటి,కరుణాకర్ రెడ్డి,జగదీశ్వర్ క్లబ్ కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి కరుణాకర్ రెడ్డి,గంగాధర్ పల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి,క్లబ్ మాజీ అధ్యక్షులు బాబుగౌడ్,శ్రీనివాస్ గౌడ్ సభ్యులు సంతోష్ కుమార్,దుష్యంత్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

## అహంకారం ఓడింది,యువత గెలిచింది

### మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి



నంగునూర్ జూలై 26 (ప్రజా జ్యోతి): అహంకారం ఓడింది,యువత గెలిచింది. ప్రజాస్వామ్యం నిలిచిందని మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరిఅన్నారు ఆదివారం విలేకరుల తో వారు మాట్లాడారు.ఇది దేశ యువతకు, ప్రజాస్వామ్యనికి దక్కిన పెద్ద విజయం అని అన్నారు.విద్యార్థి శక్తిని తక్కువగా అంచనా వేస్తే అధికారం ఎంత పెద్దదైనా సరే కుప్పకూలాల్సిందేనని అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యంపై యువత ఇచ్చిన తొలి రాజకీయ తీర్పు అని ప్రకటించారు. విద్యార్థుల ఉద్యమం, కాంగ్రెస్ పార్టీ పోరాటం, ముఖ్యంగా ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ గాంధీ కేంద్రంపై తెచ్చిన నిరంతర ఒత్తిడితోనే కేంద్రం వెనక్కితగ్గాల్సి వచ్చిందన్నారు. ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం అని, అహంకారం ఓడిపోయిన రోజు అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే నేతల పదవులు పోతాయని, ప్రభుత్వాలు మారుతాయని అన్నారు. దేశ యువతను మోసం చేసిన ప్రతి నిర్ణయానికి అంతిమ తీర్పు ప్రజలదేనని అన్నారు. ప్రజల పక్షాన, విద్యార్థి, యువత భవిష్యత్తు కోసం దేశంలో కాంగ్రెస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## నంగునూరులో మూడు రోజుల విత్తన మేళా

### రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటు

నంగునూరు, జూలై 26(ప్రజా జ్యోతి):వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నంగునూరు రైతు వేదికలో జూలై 27, 28, 29 తేదీలలో మూడు రోజుల పాటు విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి గీత తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అనువైన పంటల విత్తన రకాలను అందుబాటులో పెడుతున్నట్లు వెల్లడించారు. ఈ విత్తన మేళాలో చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, మారుతున్న వాతా వరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవడంతో పాటు సాగు వ్యయాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని కోరారు.జూలై 27 నుంచి 29 వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి నంగునూరు రైతు వేదికలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి గీత విజ్ఞప్తి చేశారు.

# కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం

### ఉత్సాహంగా పాల్గొన్న నంగునూరు మండలం బీజేపీ నాయకులు

### మంత్రి, ఎంపీ తో రైలులో ప్రయాణించిన కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి





నంగునూరు, జూలై 26(ప్రజా జ్యోతి):తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో మైలురాయిగా నిలిచిన కొమురవెళ్ళి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నంగునూరు మండల భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రైల్వే విస్తరణ పనులు తెలంగాణ అభివృద్ధికి కీలకంగా మారుతున్నాయని వారు పేర్కొన్నారు. కొమురవెళ్ళి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన నేపథ్యంలో రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడం భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని నాయకులు తెలిపారు. ముఖ్యంగా జాతర సమయాల్లో లక్షలాది మంది భక్తులు సులభంగా ప్రయాణించే అవకాశం కలుగుతుందని చెప్పారు.రైల్వే స్టేషన్ ప్రారంభంతో కొమురవెల్లి పరిసర ప్రాంతాల్లో వాణిజ్య, పర్యాటక రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం రవాణా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకురావడంలో భారతీయ జనతా పార్టీ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రైల్వే స్టేషన్ ప్రారంభించి రైలులో గజ్వేల్ వరకు ప్రయాణించారు. మంత్రి వెంట మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి రైలులో ప్రయాణించారు. రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి దాసరి యాదమల్లు, మండల శాఖ అధ్యక్షుడు చౌడుచర్ల వెంకట్రామిరెడ్డి, వల్లపు రెడ్డి రజనీకర్ రెడ్డి, నాయకులు గంధం పరమేశ్వర రెడ్డి, కత్తుల పరమేశ్వర్ రెడ్డి,అంబేద్కర్ రజనీకర్ రెడ్డి, జీడిపల్లి రజనీకాంత్ రెడ్డి, పెద్ది లవ కుమార్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం కావడం ఆనందదాయకం



### ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి

దౌల్తాబాద్, జూలై 26 ( ప్రజా జ్యోతి )రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులు గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభిస్తున్నారని దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని మల్లేశం పల్లి గ్రామానికి చెందిన శివంది భాగ్య నరసింహులు దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సొంతిల్లు ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి జరుగుతోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా పెద్దపీట వేస్తోందని చెప్పారు.ప్రజల ఆశీర్వాదంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి, గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు



జనగామ మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పడాల రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ పంచమి,స్థానిక సర్పంచ్ యశోదమ్మ ,సర్పంచులు బండారు లాలూ, పి ఎస్ ఎస్ డైరెక్టర్ బుడ్డా రమేష్, దౌల్తాబాద్ ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ,సీనియర్ నాయకులు కర్నాల శ్రీనివాసరావు, జక్క సత్యనారాయణ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పడాల మల్లేశం,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలశేఖర్ రెడ్డి, తోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న జనసేన నాయకులు కమ్మరి శ్రీను



గజ్వేల్, జూలై 26(ప్రజా జ్యోతి): గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పట్టణం లోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని జనసేన నాయకులు కమ్మరి శ్రీను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భం గా రాష్ట్ర ప్రజలకు,గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రజలందరికీ శ్రీ మహంకాళి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, తెలంగాణ రాష్ట్రంలో సుఖశాంతులు,సుభిక్షాలుగా నెలకొనాలని ప్రార్థించారు.అలాగే ప్రజలందరూ ఆరోగ్యంగా,ఆనందంగా జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు కమ్మరి శ్రీనుకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు దావత్ సతీష్, కరుణాకర్ రెడ్డి, సాయి,పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## డా. శిరీషకు 'వైద్యరత్న' అవార్డు



సిద్దిపేట అర్బన్, జూలై 26 ,(ప్రజాజ్యోతి): సిద్దిపేటకు చెందిన మేఘన హస్పిటల్ వైద్యురాలు డా. శిరీషకు ప్రతిష్టాత్మక 'వైద్యరత్న' అవార్డు లభించింది. హైదరాబాద్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మదర్ ఫౌండేషన్ ఈ అవార్డును ఆమెకు ప్రదానం చేసింది.రాష్ట్రవ్యాప్తంగా వివిధ వైద్య విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన 25 మంది వైద్యులను వైద్యరత్న అవార్డుతో సత్కరించగా, వారిలో సిద్దిపేటకు చెందిన డా. శిరీష ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.అవార్డు అందుకున్న సందర్భంగా డా. శిరీష మాట్లాడుతూ, ఈ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, పేదలు, సామాన్య ప్రజలకు అందుబాటులో నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమన్నారు. డా. శిరీషకు 'వైద్యరత్న' అవార్డు లభించిన సందర్భంగా వైద్యులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు, బంధువులు, సిద్దిపేట ప్రముఖులు ఆమెను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## బాధిత కుటుంబానికి అండగా పిహెచ్ కె ఫౌండేషన్




సిద్దిపేట అర్బన్, జూలై 26 ,(ప్రజాజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్పల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు మాసంపల్లి ఎల్లయ్య ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.ఈ సందర్భంగా సిద్దిపేట అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిక్షపతి ఫౌండేషన్ ప్రతినిధిగా మృతుని కుటుంబాన్ని వారి నివాసంలో పరామర్శించి, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం పిహెచ్ కె ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మృతుడు మాసంపల్లి ఎల్లయ్యకు నివాళులర్పించారు.

# రిజర్వేషన్ల పితామహుడు సాహు మహరాజ్

### దాసరి ఏగొండ స్వామి డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

గజ్వేల్ జూలై 26(ప్రజా జ్యోతి):భారత సామాజిక ప్రజాస్వామ్య మూల స్తంభం, రిజర్వేషన్ల పితామహుడు,తొలి సామాజిక న్యాయోద్యమకారుడు, ఛత్రపతి సాహుజి మహరాజ్ 152 వ సాహుమహరాజ్ జయంతిని గజ్వేల్ లో ఆదివారం నాడు దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి,డిబిఎఫ్ మండల అధ్యక్షులు సింగాటం దార చంద్రంతో కలిసి జన్మదినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా దాసరి ఏగొండ స్వామి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో దళిత, బహుజనులను విముక్తి చేయడానికి సైద్ధాంతికంగా, పాలనాపరంగా మహాత్మ జ్యోతిబాపూలే, ఛత్రపతి శివాజీల వారసుడిగా కృషి చేసిన మహనీయుడు ఛత్రపతి సాహుమహరాజ్. 1874 జూన్ 26న జన్మించిన యశ్వంతరావు ఘాట్గేనే ఆ తర్వాత కాలంలో సాహు మహరాజ్గా ప్రసిద్ధి చెందాడన్నారు.తను సింహాసనం అధిష్టించే నాటికి తన రాజ్యంలో అన్ని రంగాల్లో బ్రాహ్మణులు నిండిపోవడం చూసిన సాహు బ్రాహ్మణేతరులని ఉన్నత ఉద్యోగాల్లోకి తెస్తే తప్ప వారి సామాజిక హోదాలో, జీవితాల్లో మార్పు రాదని భావించి వారికి స్కూల్స్, హాస్టల్స్ ప్రారంభించి విద్యను ఉద్యమంగా నడిపాడు.ప్రతి గ్రామంలో కనీసం ఒక ప్రాథమిక పాఠశాల నేర్పరచి అందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యనందించాడు. పాఠశాలలకు స్వంత భవనాలు ఏర్పడే వరకు గ్రామాల్లోని ఆలయాలను, చావడీలను పాఠశాలలుగా వాడాలని, గ్రామంలో ఏ కులస్తులు మెజారిటీగా ఉన్నారో ఆ కులపు వ్యక్తినే ఉపాధ్యాయుడిగా నియమించాడన్నారు. అంబేద్కర్ విదేశాల్లో ఉన్నంత కాలం 'మూక్ నాయక్' పత్రిక నిర్వహణకి సాహు మహరాజ్ ఆర్థిక సహాయం చేశారన్నారు. పితృస్వామ్య, కుల, మత వ్యవస్థల వల్ల స్త్రీల మీద జరుగుతున్న అమానుషాలని గ్రహించిన సాహు మొదట తన భార్య లక్ష్మీబాయికి యూరోపియన్ టీచర్ల ద్వారా ఆధునిక విద్యను చెప్పించి,సంగీతంలో, చిత్రలేఖనంలో, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇప్పించారన్నారు. ఉన్నత విద్యలోకి బాలికలను ప్రోత్సహించేందుకు ఉపకారవేతనాలు,



ప్రోత్సాహక బహుమతులు ఏర్పాటు చేశారన్నారు.1919 జూన్లో బాల్య వివాహాల రద్దు చట్టం వచ్చింది. 1919 జూలై 12న కులాంతర, వర్ణాంతర వివాహాలను చట్టబద్ధం చేస్తూ చట్టం తెచ్చిన కొల్హాపూర్ స్పెషల్ మ్యారేజీ యాక్ట్ – 1918 ప్రకారం ఎందరో యువతీ యువకులు తమకు నచ్చిన భాగస్వామ్యులను ఎన్నుకున్నారన్నారు.విడాకులు మంజూరు చేయడంలో స్త్రీల నిర్ణయానికే ప్రాధాన్యతనిస్తూ 1919 ఆగస్టు 2న ప్రకటించిన విడాకుల చట్టం, స్పెషల్ మ్యారేజీ యాక్ట్ అప్పట్లో దేశంలో సంచలనం సృష్టించాయి. 1920 జనవరి 17న జోగిని, దేవదాసీ వ్యవస్థను రద్దు చేశారు. ప్రభుత్వం తరపున దేవదాసీల పునరావాసానికి చర్యలు తీసుకున్నారన్నారు.మహరాజుగా అనేక సంస్కరణలు తీసుకొచ్చిన రిజర్వేషన్ల పితామహుడు సాహు మహరాజ్ 1922 మే 6న మరణించారు.ఈ కార్యక్రమంలో పెంటయ్య,షాదుల్లా,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ ఆలయంలో యంత్ర ప్రతిష్టాపన నిర్వహణ

### ఆలయ పనులు త్వరగా పూర్తి చేస్తాం

### ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ నరేందర్

దుబ్బాక ప్రతినిధి , జూలై 26 (ప్రజా జ్యోతి): దుబ్బాక పట్టణంలోని అంగడి బజార్ లో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయంలో ఆదివారము దేవాదాయ శాఖ స్థపతి వల్లినాయగం సమక్షంలో ఆలయ కమిటీ సభ్యుల





ఆధ్వర్యంలో యంత్ర శిల ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ నరేందర్ మాట్లాడుతూ ఆలయ పనులు వేగంగా సాగుతున్నాయని,ఆరు నెలల్లోగా ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దుబ్బాక పట్టణ ప్రజల సహకారంతో పోచమ్మ ఆలయన్ని అత్యద్భుతంగా నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వడ్లకొండ శ్రీధర్, గన్నె బుచ్చిరెడ్డి, కృష్ణమ్మ గారు సుభాష్ రెడ్డి, గుండెల్లి లక్ష్మారెడ్డి, బోస్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ములుగు రాజీవ్ రహదారిపై

# రోడ్డు ప్రమాదం

### అక్కడికక్కడే మృతి చెందిన వ్యక్తి

ములుగు,జూలై26 (ప్రజాజ్యోతి)ములుగు రాజీవ్ రహదారి సబ్ స్టేషన్ ఎదురుగా డబుల్ బెడ్ రూమ్ ముందర టీవీఎస్ ఎక్సెల్ పై వస్తూ అదుపుతప్పి రోడ్డుపై పడగా తీవ్ర గాయా లు కాగా వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి ములుగు పోలీసుల అందించిన వివరా లు ఈ విధంగా ఉన్నాయి కామారెడ్డి జిల్లా,బిక్నూర్ మండ లం, బస్వాపూర్ గ్రామానికి చెందిన కాసెట్టి బాలమల్లు (45) భార్య లక్ష్మి లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స చే యించుకుంటుంది,భార్య లక్ష్మి దగ్గరికి టీవీఎస్ ఎక్సెల్ పై వస్తున్న క్రమంలో ములుగు సమీపంలో గల డబుల్ బెడ్ రూ మ్ ఎదురుగా రాజీవ్ రహదారిపై అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు చెందాడు,మృతుడి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

## బీసీ వెల్ఫేర్ హాస్టల్లో విద్యార్థుల ఆందోళన



సిద్దిపేట రూరల్ , జులై 26 ,(ప్రజాజ్యోతి): సిద్దిపేటలోని డబుల్ బెడ్రూమ్ బీసీ వెల్ఫేర్ హాస్టల్లో ప్రిన్సిపాల్ శ్రీలత విద్యార్థులను తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. హాస్టల్ నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు రోడ్డుపై నడుచుకుంటూ పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు సంఘీభావంగా బిఆర్ఎస్వీ నాయకులు పాత బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హాస్టల్లో గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సమస్యలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు.విద్యార్థుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రిన్సిపాల్ శ్రీలతపై వెంటనే చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని బిఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల సంక్షేమానికి భంగం కలిగించే ఘటనలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.ఈ ధర్నాలో రెడ్డి యాదగిరి, కంకటి నవీన్ గౌడ్, ఇరుగంటి రమేష్, గుండెల్లి నాగరాజు, అప్పాల శేఖర్, గుర్రం సతీష్ రెడ్డి, గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, చెట్టుపల్లి భానుచందర్, మార్క భార్గవ్, ఘనపురం సాయి కుమార్ తదితర బిఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ అవార్డు గ్రహీత ముత్యాల నర్సింలుకు ఘన సన్మానం

## జాతీయ గౌతమ బుద్ధ అవార్డు అందుకున్న సామాజిక సేవకుడికి ఘనాభినందనలు



దౌల్తాబాద్ , జూలై 26 ( ప్రజా జ్యోతి )బుద్ధుడు పూలే అంబేడ్కర్ సిద్ధాంతం ఆచరిస్తూ ప్రచారం చేస్తూ జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక గౌతమ బుద్ధ అవార్డు అందుకుని సిద్దిపేట జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన బీఎస్ఐ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింలు రజక ధమ్మచారికి ఘన సన్మానం చేశారు. ఆదివారం దౌల్తాబాద్ మండల కేంద్రం ఎస్వీ ఫంక్షన్ హాల్ నిర్వహించగా ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ఉప్పర మల్లేశం, జిల్లా అధ్యక్షులు ఎనగందుల శంకర్ బోధి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బుద్ధుడు బోధించిన కరుణ, సమానత్వం, అహింస, మానవత్వం వంటి విలువలను, మహాత్మా జ్యోతిరావు పూలే ప్రతిపాదించిన విద్య, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల సాధికారత, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ చూపిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, రాజ్యాంగ విలువలు ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పించేందుకు ముత్యాల నర్సింలు ఎన్నో సంవత్సరాలుగా నిరంతరం కృషి చేస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. బౌద్ధ ధర్మ ప్రచారం, సామాజిక చైతన్యం, మూఢనమ్మకాల నిర్మూలన, యువతలో రాజ్యాంగ అవగాహన పెంపు, బహుజన ఐక్యత కోసం ఆయన చేసిన సేవలు విశేషమని పేర్కొన్నారు.ఈ సేవలకు గుర్తింపుగా ఆయనకు జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక 'గౌతమ బుద్ధ అవార్డు' లభించగా, ఈ సందర్భంగా శాలువా కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవడం సిద్దిపేట జిల్లాకే గర్వకారణమని, యువతకు ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సన్మాన కార్యక్రమాన్ని బీఎస్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ, బుద్ధ విహార్ మైత్రి సంఘం సిద్దిపేట జిల్లా కమిటీ, డీపీఎస్ ధమ్మపద ఫిలోమత్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించాయి.అలాగే పలువురు వక్తలు మాట్లాడుతూ బుద్ధుడు–పూలే–అంబేద్కర్ సిద్ధాంతాలే సమాజ అభ్యున్నతికి మార్గదర్శకాలని, కుల వివక్ష నిర్మూలన, సామాజిక సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఆ మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి బౌద్ధ సంఘాల ప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు, బహుజన ఉద్యమకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నర్సింలు సేవలను ప్రశంసించారు.అనంతరం ముత్యాల నర్సింలు మాట్లాడుతూ, బుద్ధుడు, మహాత్మ పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలోనే తన జీవితాంతం సామాజిక సేవ కొనసాగిస్తానని, అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యా చైతన్యం, రాజ్యాంగ పరిరక్షణ, బౌద్ధ ధర్మ ప్రచారం కోసం మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ గుర్తింపు తన ఒక్కరికే కాకుండా సమాజ మార్పు కోసం కృషి చేస్తున్న ప్రతి సామాజిక కార్యకర్తకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు తుమ్మ శ్రీనివాస్, చిప్పల యాదగిరి, దుబాషి సంజీవ్, బిఎస్ఐ కోశాధికారి సాయిబాబు, జిల్లా కమిటీ సభ్యులు తిరుపతిరావు, తిరుపతి, పుట్ట రాజు, జర్నలిస్ట్ మహేష్, బోనాల స్వామి, మేకల రాములు, అరుణోదయ సాయి, ఎద్దు నరేందర్, తాళ్ళపల్లి యాదగిరి, అడ్వకేట్ పాండరి, రాజేశ్వరరావు, వాసుదేవ రెడ్డి, ఆకారం సత్యం,రాజు, మహేందర్, ప్రేమ కుమార్, గౌతం తదితరులు పాల్గొన్నారు.



## 24 గంటల్లోనే పరారైన నిందితుడి అరెస్ట్




సిద్దిపేట, జులై 26 ,(ప్రజాజ్యోతి):సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పోలీసుల కన్నుగప్పి పరారైన నిందితుడిని సిద్దిపేట పోలీసులు కేవలం 24 గంటల్లోనే అరెస్టు చేసి తమ సమర్థతను మరోసారి చాటుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. జూలై 25 వతేదీ మధ్యాహ్నం నిందితుడిని సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ సమయంలో పోలీసు వ్యాన్లో ఉండగానే తన చేతులకు వేసిన సంకెళ్లను విడదీసుకుని, వాహనం ఎమర్జెన్సీ డోర్ ద్వారా బయటకు దూకి సమీపంలోని సందులోంచి పరారయ్యాడు. అనంతరం కోమటిచెరువు కట్టపై ఉన్న ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరించి అక్కడి నుంచి తప్పించుకున్నాడు.ఘటనపై వెంటనే స్పందించిన సిద్దిపేట పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, ఇంటెలిజెన్స్ సమాచారంతో విస్తృతంగా గాలింపు చేపట్టారు.ఈ క్రమంలో పరారైన నిందితుడిని ఆదివారం మధ్యాహ్నం సుమారు 12 గంటలకు కామారెడ్డి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పరారైన 24 గంటల్లోపే నిందితుడిని పట్టుకోవడంతో పోలీసుల వేగవంతమైన దర్యాప్తు ఫలించింది.నిందితుడిని చాకచక్యంగా గుర్తించి అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్అభినందించారు.

## అనారోగ్యంతో ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

### కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

### దుబ్బాక్ ఎస్ఐ కీర్తిరాజు వెల్లడి



దుబ్బాక , జులై 26 (ప్రజా జ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుడు జీవితం మీద విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక మండలం కమ్మరపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.

దుబ్బాక ఎస్సై కే.కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన కొమ్మాట మల్లయ్య (70) అనే వృద్ధుడు కూలి పని చేస్తూ, కుమారుడి కుటుంబంతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు.గత కొంతకాలంగా వృద్ధుడు తీవ్రమైన షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం కాలికి గాయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.షుగర్ వ్యాధితో కాలికి అయిన పుండు తగ్గకపోవడంతో, జీవితం మీద విరక్తి చెందిన మల్లయ్య, కుమారుడి ఇంటి పక్కనే ఉన్న మరో గదిలో ఆదివారం తెల్లవారుజామున మల్లయ్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఉదయం జరిగిన ఘటనను గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని, పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు రాజెల్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.




## విద్యారంగ సమస్యలపై 'ఛలో కలెక్టరేట్'

సిద్దిపేట రూరల్ , జులై 26 ,(ప్రజాజ్యోతి): సిద్దిపేట జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రేపు నిర్వహించనున్న 'ఛలో కలెక్టరేట్' ముట్టడి కార్యక్రమాన్ని విద్యార్థులంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని యూ ఎస్ ఎఫ్ ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు పిలుపునిచ్చారు.ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.కెసీఆర్ నగర్ డబుల్ బెడ్రూమ్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, జిల్లాలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలలో విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే చెల్లించాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు , సంక్షేమ హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు బీసీ, ఎస్సీ కాలేజీ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ ,ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయని వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గుడికందుల రవి, జిల్లా నాయకులు హేమంత్, వినయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.